సొంత రాష్ట్రాలకు కాంట్రాక్టు కార్మికులు



గోదావరిఖని: రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీలో ఓబీ కాంట్రాక్టు పనులు చేస్తున్న పీసీ పటేల్ కంపెనీలోని ఇతర రాష్ట్రాల కార్మికులు శనివారం తమ రాష్ట్రాలకు తరలివెళ్లారు. 80శాతం మంది స్థానిక కార్మికులను ఓబీ కంపెనీలో ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కోరుతూ స్థానికులు మూడురోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఓబీ కంపెనీలో స్థానికేతరులు సుమారు 500మందికిపైగా ఉన్నారని, వారందరినీ వారి రాష్ట్రాలకు పంపించి వేస్తేనే తాము విధులకు హాజరవుతామని స్థానికులు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులను స్థానికులు వారి రాష్ట్రాలకు పంపించి వేశారు. 20శాతం కన్నా ఎక్కువ మంది స్థానికేతరులు ఉంటే ఊరుకోబోమని వారు హెచ్చరించారు. ఈమేరకు ప్రైవేట్ ఓబీ కంపెనీ కూడా అంగీకరించినట్లు స్థానిక కార్మికులు తెలిపారు.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జడ్జి ఎస్.మంజుల

గోదావరిఖనిటౌన్: లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం అందుతుందని గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మంజుల అన్నారు. ఈనెల 28న చేపట్టే జాతీయలోక్ అదాలత్ సందర్భంగా శనివారం స్థానిక మున్సిఫ్ కోర్టులో న్యాయవాదులు, పోలీస్ అధికారులతో లోక్ అదాలత్ సమన్వయ సమావేశం నిర్వహించారు. పగలు, ప్రతీకారాలతో సాధించేదేమీ ఉండదన్నారు. రాజీమార్గం ఉత్తమమని పేర్కొన్నారు. ఏపీపీ సహీదా ఫర్వీన్, గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొటం సతీశ్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, లింగమూర్తి, ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఎస్సైలు సతీశ్ కుమార్, హరిశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తరం రాసినా సేవలు ఉచితం



మాట్లాడుతున్న జడ్జి గణేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): న్యాయం కోసం ఉత్తరం రాసినా లీగల్ సెల్‌సర్వీస్‌తో ప్రభుత్వమే ఉచితంగా సేవలు అందిస్తుందని మున్సిఫ్ కోర్టు జడ్జి గణేశ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, మహిళలు ఇబ్బందులు కలిగితే న్యాయ సాయం తీసుకోవాలని జడ్జి సూచించారు. విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక, ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, సుల్తానాబాద్ బార్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, జనరల్ సెక్రటరీ జోగుల రమేశ్, ఏజీపీ ఆవుల లక్ష్మీరాజం, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి



జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఏఈఓలు

పెద్దపల్లిరూరల్: పంటలు పండించే రైతులకు అవసరమైన సలహాలు, సూచనలిస్తూ అందుబాటులో ఉండే తమపై అధిక పనిభారం పడుతోందని, ఆ భారాన్ని తగ్గించాలని జిల్లాలోని వ్యవసాయ విస్తీర్ణాధికారులు(ఏఈవో) కోరారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం రైతుసంక్షేమం కోసం అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, పీఎంకిసాన్, పంట నమోదు, పంట నష్టం సర్వే, పంట కోత ప్రయోగాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతునేస్తం లాంటి అనేక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలతో సతమతమవుతున్నామని వాపోయారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకులను నియమించి పనిభారం తగ్గించాలని వారు కోరారు.

ఇంటింటా చెత్త సేకరించాలి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఇంటింటా చెత్త సేకరిస్తూ, కంపోస్టు ఎరువు తయారు చేయాలని, పారిశుధ్యం నిర్వహణలో జిల్లాను అగ్రభాగాన నిలపాలని డీపీవో వీరబుచ్చయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల పంచాయతీ కార్యదర్శులతో పారిశుధ్యం నిర్వహణపై శనివారం జిల్లా పంచాయతీ అధికారి సమీక్షించారు. చెత్తరహిత గ్రామాలుగా తీర్చి దిద్దుతామని, వ్యాధులను దూరం చేస్తామని పంచాయతీ కార్యదర్శులతో ప్రతిజ్ఞ చేయించారు. సకాలంలో ఆస్తిపన్నుల వసూలు చేయాలని సూచించారు. వృత్తి, వ్యాపార లైసెన్సులు, గృహ నిర్మాణ అనుమతులు సకాలంలో జారీ చేయాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. ఎంపీడీవో రామ్మోహనా చారి, ఎంపీవో గోవర్ధన్, డీఎల్‌పీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాయగాళ్లున్నారు.. పైలం బిడ్డా



పరిణతి లేని వయసు.. మంచిచెడు ఏంటో అర్థం చేసుకోలేరు.. ఎవరు ఆప్యాయంగా పలకరిస్తే వారిని తమ ఆత్మీయులని అనుకుంటారు.. ఈ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, యువకులు, మధ్య వయస్కులు, పలు స్కూళ్లు, కళాశాలల్లో అయితే పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాలికలను వంచిస్తున్నారు.. లైంగిక దాడికి పాల్పడుతున్నారు.. ప్రేమ, పెళ్లి అంటూ వేధిస్తున్నారు.. నిత్యం ఎక్కడో ఒక చోట ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి.. ఇవన్నీ చూస్తున్న తల్లిదండ్రులు భయంభయంగా బతకాల్సిన దుస్థితి నెలకొంది. ఇటువంటి భయానక పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ కూతుళ్లకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి కచ్చితంగా చెప్పాలి. అలాగే, ఇంటికి వచ్చిన పిల్లలు మీతో అన్ని విషయాలు చెప్పుకునే వాతావరణం కల్పించాలి.– కరీంనగర్‌క్రైం/సిరిసిల్లక్రైం/జగిత్యాల/గోదావరిఖని

కఠినంగా వ్యవహరిస్తాం



చిన్నారులపై అఘాయిత్యాల కేసుల్లో తల్లిదండ్రుల గౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా గోప్యతను పాటిస్తూ భరోసా కల్పిస్తున్నాం. బాలికలు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. సమస్య ఉంటే డయల్ 100కి సమాచారం ఇవ్వాలి.

– ఎం.శ్రీనివాస్, సీపీ, రామగుండం

నిర్భయంగా ఫిర్యాదు చేయాలి




జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. షీటీం, మెసేజ్ యువర్ ఎస్పీ నంబర్ 6303922572, డయల్100 అందుబాటులోకి తెచ్చాం. అనేక విద్యాలయాల్లో, గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఆపదలో ఉన్న వారు నిర్భయంగా ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తాం.

– అఖిల్ మహాజన్, ఎస్పీ, సిరిసిల్ల

వారిది ఉన్నత కుటుంబం. ఒక్కగానొక్క కూతురు. పదోతరగతి చదువుతున్న సమయంలోనే ఆమె ఆకర్షణకు లోనైంది. మాయమాటలు నమ్మి మోసపోయింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మనోవేదనకు గురయ్యారు. బిడ్డా.. పద్ధతి మార్చుకో.. మంచిగ చదువుకో అని సున్నితంగా హెచ్చరించారు. అయినా లాభం లేకపోయింది. కారు నడిపే వ్యక్తితో వెళ్లిపోయింది. అతను కష్టపడితేనే పూట గడిచేది. ఇప్పుడు ఆ అమ్మాయిని సాకేందుకు ఇబ్బంది పడుతున్నాడు. ఉన్నత కుటుంబంలో పుట్టి పెరిగిన ఆ బాలిక మోసపోయానని తెలుసుకుంది. మనోవేదనకు గురవుతోంది.

ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని యువకుడితో ప్రేమలో పడింది. ఏం ఆలోచించకుండా ఇల్లు వదిలి వెళ్లిపోయింది. కొన్నిరోజుల తర్వాత ప్రేమించిన యువకుడు ఆమెను వదిలించుకునేందుకు రెడీ అయ్యాడు. అయితే అతను ఇప్పటికే పలువురిని నమ్మించి మోసం చేసినట్లు తెలుసుకొని మనోవేదనకు గురవుతోంది.

‘మూడో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలికపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడటంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. కోర్టులో చార్జిషీట్ వేయగా ఆ ఇద్దరికీ జీవితఖైదు విధిస్తూ జడ్జి తీర్పు నిచ్చారు.’



- వివరాలు 8లో ▶

సన్నరకం వైపే మొగ్గు

- జిల్లాలో 83,825 ఎకరాల్లో సన్నరకం వరి సాగు
- ఈ సీజన్ నుంచే రూ.500 బోనస్ వర్తింపు
- ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేసిన అధికార యంత్రాంగం

జిల్లాలో సాగు సమాచారం(ఎకరాల్లో)

రకం	సాగు	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
దొడ్డు	14,670	91,701
సన్నాలు	69,152	3,97,615



సాక్షి, పెద్దపల్లి: సన్నరకం వడ్లు క్వింటాలుపై రూ.500 బోనస్ ప్రకటిస్తూ ఈ వానాకాలం సీజన్ నుంచే అమలు చేస్తుండడంతో గతంలో కంటే ఈసారి సన్నరకం వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతేడాది వానాకాలంలో 55శాతం సన్నరకం వరి సాగు చేస్తే ఈఏడాది అది ఏకంగా 80శాతానికి పైగా చేరిందని అధికారులు చెబుతున్నారు. వానాకాలంలో నీటి లభ్యత, సానుకూల వాతావరణం దృష్ట్యా రైతులు సహజంగానే సన్నరకం వరి సాగు వైపు ఎక్కువ దృష్టి పెడతారు. దీనికితోడు రాష్ట్రప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించడంతో సన్నరకం వరి పండించేందుకు ఈసారి అన్నదాతలు ఎక్కువగా ఆసక్తి చూపారు. దీనికి అనుగుణంగా శుక్రవారం క్యాబినెట్ సమావేశంలోనూ బోనస్‌కు ఆమోదముద్ర వేయడం కర్షకుల్లో ఆనందం రెట్టింపు చేసినట్లయ్యింది.

311 కేంద్రాలు.. 4 లక్షల మెట్రిక్ టన్నులు

వానాకాలం దిగుబడి సేకరించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో ఇటీవల కొనుగోళ్లపై సమీక్షించారు. కొనుగోలు కేంద్రాలు, ఇతర అంశాలపై చర్చించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో 83,825 ఎకరాల్లో వరి సాగవగా.. 4,89,316 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో సుమారు 4,06,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా జిల్లావ్యాప్తంగా 311 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే గ్రేడ్ – ఏ రకం ధాన్యం క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర నిర్ణయించారు. సన్నరకం వడ్లను నిర్దేశించిన రైస్‌మిల్లులకు మాత్రమే తరలించేలా కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ఏవోలను సమన్వయం చేసుకుంటూ రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

క్రాప్ బుకింగ్‌లో సన్నరకం రైతుల వివరాలు

బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో సన్నరకం వరి పండించే రైతులకు వర్తించే బోనస్‌పై స్పష్టత ఇస్తూ జీవో నంబరు 27ను ఇటీవల విడుదల చేసింది. ఇందులో బీపీటీ–5204, ఆర్ఎన్ఆర్–15048, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్ తదితర 33 రకాల వడ్లను సన్నరకాలుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే క్రాప్ బుకింగ్‌లో పేర్లు నమోదైన వివరాల ఆధారంగానే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తారు. పంట నమోదులో కానివారి పంటలను విక్రయించే సందర్భంలో సమస్యలు తలెత్తుతాయి. దీంతో వ్యవసాయశాఖ యంత్రాంగం సన్నవడ్లు పండించిన రైతుల పేర్లు, సాగు చేసిన భూమి సర్వే నంబర్లు, విస్తీర్ణం, రకానికి సంబంధించిన వివరాలను పంట నమోదు (క్రాప్ బుకింగ్)లో నమోదు చేశారు.

దిగుబడి తక్కువే అయినా..

సాధారణంగా సన్నరకాల సాగుకు శ్రమ ఎక్కువే. దొడ్డు రకంతో పోల్చితే సన్నరకం వరి దిగుబడి తక్కువ. దొడ్డు రకం సగటున ఎకరాకి 30 బస్తాల నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. అదే సన్నరకమైతే ఎకరాకి సగటున 2 క్వింటాళ్ల – 3 క్వింటాళ్ల వరకు దిగుబడి తక్కువగా ఉంటుంది. దొడ్డు రకంతో పోల్చితే సాగు సమయం ఎక్కువ. దీనితో పాటు చీడపీడల బెడద అధికంగా ఉంటుంది. ధర విషయానికి వచ్చేసరికి సన్నరకానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటోంది. దొడ్డు రకంతో పోల్చితే సన్నరకానికి క్వింటాలుకు ప్రైవేట్ మార్కెట్‌లో రూ.500 – రూ.600 వరకు అధిక ధర లభిస్తోంది. మార్కెట్ వరకు తీసుకువెళ్లకుండానే పొలాల వద్దనే వ్యాపారులు ఎక్కువ ధర చెల్లించి సన్నరకం వడ్లు కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు ఇంటి అవసరాలకు కొత్త ధాన్యాన్ని రైతులు కొంత తమ ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వానికి అవసరమైన సన్నబియ్యం మార్కెట్‌లో లభించడం లేదు. దీంతోనే సన్నరకం వడ్లకు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సాగు విస్తీర్ణం పెరిగింది



జిల్లాలో గతేడాది కంటే సన్నరకం వడ్ల సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌తో పాటు, మార్కెట్‌లో సన్నబియ్యానికి డిమాండ్ ఉండడంతో రైతులు వీటి సాగుకే మొగ్గు చూపారు. సస్యరక్షణ చర్యల కోసం స్థానిక వ్యవసాయ అధికారు సలహాలు, సూచనలను పాటించాలి.

– ఆదిరెడ్డి, డీఏవో

ప్రభుత్వ ఆస్పత్రిలోనే నాణ్యమైన సేవలు

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మెరుగుపడాలి
- అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: స్థానిక మాతా శిశు కేంద్రంలో ప్రసూతి సేవల కోసం వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వైద్యసేవలపై సమీక్షించారు. కొన్ని పీహెచ్‌సీల్లో గర్భిణుల నమోదు తక్కువగా ఉంటోందని పేర్కొన్నారు. అక్కడ నూరుశాతం నమోదయ్యేలా చూడాలని అన్నారు. గర్భిణుల నమోదు జాబితా ప్రతీసూపర్‌వైజర్ వద్ద ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే డెలివరీలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అందుబాటులో 102, 108 అంబులెన్స్ సేవలు..

పరీక్షలు, ఇతర అవసరాల కోసం గ్రామాల నుంచి వచ్చే గర్భిణులు 102 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. గర్భిణులు వైద్య పరీక్షలకు హాజరయ్యే సమయాలపై జాబితా రూపొందించుకుని ఆ ప్రకారంగా వాహనాల్లోనే తరలించాలని పీహెచ్‌సీ సిబ్బందిని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌ల్లో ఆస్పత్రులకు తీసుకెళ్లాలని సూచించారు.

మాతాశిశు ఆస్పత్రిలో ఏసీ రూమ్‌లు..

ప్రసూతి కోసం వచ్చే గర్భిణుల కోసం స్థానిక మాతా శిశు ఆస్పత్రిలో నామమాత్రపు అద్దెకు ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. గర్భిణులు, వారి కుటుంబ సభ్యులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు.

జ్వరాలపై ప్రత్యేక దృష్టి

జ్వరాలు, ఒంటినొప్పులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సూచించారు. ఫీవర్ సర్వేతోపాటు జిల్లా ఆస్పత్రికి వచ్చే వారి గ్రామాలపై ఆరా తీయాలని అన్నారు. పంచాయతీ అధికారుల సహకారంతో గ్రామాల్లోనే వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీధర్, అన్నప్రసన్న, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో అధికారుల ‘పొలంబాట’

పెద్దపల్లిరూరల్: రైతులు పంట సాగు చేసే భూముల్లో నెలకొన్న విద్యుత్ పరమైన సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు పొలంబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ బొంకూరి సుదర్శన్ శనివారం తెలిపారు. వంగిన స్తంభాలు, లూస్ లైన్లను గుర్తించి ఇప్పటికే సవరించే పనులు చేపట్టినట్లు వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో మధ్య స్తంభాలను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే వెంటనే 1912 నంబరుకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వెంటనే సంబధిత అధికారికి యాప్ ద్వారా సమాచారం వెళ్తుందని వివరించారు. దాని ద్వారా సంబంధిత అధికారులకు సమాచారం అందించి ట్రాన్స్‌ఫార్మర్ మార్చేలా చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సొంతంగా పనులు చేసేందుకు సాహసించొద్దని ఆయన సూచించారు. మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకునేందుకు నిరంతరం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన వివరించారు.

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం

- మార్కెట్ కమిటీలో మహిళకు చోటు కల్పించాం
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని, ఈ నేపథ్యంలో పెద్దపల్లి నియోజకవర్గంలో తొలిసారి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవిని దళిత మహిళకు అప్పగించామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్‌గా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఈర్ల స్వరూపను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఆయన పేర్కొన్నారు. ఈమేరు ఈర్ల స్వరూప శనివారం ఎమ్మెల్యే విజయరమణారావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజాపాలన అందిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విషప్రచారాన్ని నమ్మ వద్దని కోరార. కార్యక్రమంలో నాయకులు సురేశ్‌గౌడ్, ఎడెల్లి శంకర్, మల్లయ్య, నదీం, సంతోష్, సంపత్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇదే..

పాలక మండలి చైర్‌పర్సన్‌గా ఈర్ల స్వరూపను నియమించారు. వైస్ చైర్మన్‌గా కాసులపల్లికి చెందిన కూర మల్లారెడ్డి, డైరెక్టర్లుగా రాగినేడుకు చెందిన సోమ చంద్రయ్య, మ్యాడగోని శ్రీనివాస్(గుర్రాంపల్లి), కొమ్ము కరుణాకర్(గౌరెడ్డిపేట), కొలిపాక కనకయ్య(కనగర్తి), వేగోళపు పెద్దరాజేశం(తుర్కలమద్దికుంట), గౌస్‌మియా(అందుగులపల్లి), మొగుసాల నరోత్తంరెడ్డి(పెద్దబొంకూర్), ఎడ్ల మహేందర్(పెద్దపల్లి), గోపతి సదానందం(ఓదెల), పిట్టల కొమురయ్య(పిట్టల ఎల్లయ్యపల్లి), కొల్లూరి రాంచంద్రం(కొలనూరు), తిప్పారపు ప్రభాకర్(గూడెం) నియమితులయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

జూలపల్లి మార్కెట్ కమిటీ..



గండు సంజీవ్

జూలపల్లి(పెద్దపల్లి): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాచాపూర్ గ్రామానికి చెందిన గండు సంజీవ్‌ను నియమించారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉపాధ్యక్షుడిగా జూలపల్లికి చెందిన కొమ్మ పోచాలు, డైరెక్టర్లుగా కందుకూరి అంజయ్య, మల్లారపు సంతోష్ కుమార్, ఉత్తెర్ల సమ్మయ్య, జక్కని శంకరయ్య, మంద రమేశ్, గంగిపెల్లి చుక్కయ్య, లోక రాజిరెడ్డి, కోరుకంటి అంజమ్మ, పొన్నం రమేశ్, మల్లెత్తుల కొమురయ్యను నియమించారు.

క్లుప్తంగా

బోనస్ చెల్లించాలని వినతి

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌లోని క్యారేజ్ అండ్‌వ్యాగన్ (సీ అండ్‌డబ్ల్యూ) డిపో కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే మల్టిపుల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కన్నూరి సతీశ్‌కుమార్ కోరారు. ఈమేరకు డిపో సహాయక డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ మల్లికార్జున్‌రావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. నేషనల్ హాలిడే(ఎన్‌హెచ్)లను కూడా కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయాలని రైల్వే ఉన్నతాధికారికి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారని సతీశ్ కుమార్ తెలిపారు.

బిల్‌కలెక్టర్ సస్పెన్షన్

మంథని: అవినీతి, ఆరోపణల నేపథ్యంలో మంథని మున్సిపల్ బిల్‌కలెక్టర్ రాజును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఉత్తర్వులు జారీచేశారు. పట్టణానికి చెందిన సయ్యద్ అఫ్రోజ్ 2024 సెప్టెంబర్ 19న బిల్‌కలెక్టర్ రాజు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదు చేశాడు. ఆస్తిపన్ను రూ.50వేలు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో పునః పరిశీలించే అంశంలో బిల్‌కలెక్టర్‌ను ఫిబ్రవరి 2024లో సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ సంప్రదించారు. అయితే, తనకు రూ.25వేలు చెల్లించాలని బిల్‌కలెక్టర్ చెప్పారని, రూ.14 వేల నగదు, ఫోన్‌పే ద్వారా రూ.11 వేలు చెల్లించాడని పేర్కొన్నారు. ఆ తర్వాత ఆస్తిపన్ను రసీదు కావాలని అడిగితే రూ.647 మాత్రమే ఆస్తిపన్ను రసీదు రాసి ఇచ్చారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదుపై ఆధారాలు పరిశీలించిన అనంతరం బిల్‌కలెక్టర్‌ను సస్పెండ్ చేశారు.

ఇద్దరు కీచక ఉపాధ్యాయులపై..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఇద్దరు కీచక ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఓ విద్యార్థినితో తరచూ అసభ్యకరంగా ప్రవర్తించడంతో గ్రామస్తులు ఈనెల 12న ఆ ఇద్దరు ఉపాధ్యాయులపై దాడి చేశారు. ఈనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఈవో జనార్దన్‌రావు ఉపాధ్యాయుల ప్రవర్తనపై విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఎల్‌ఆర్ నంబర్ 2062/ఏ2/2024, తేది21-09-2024న ఉత్తర్వులు జారీచేశారు.

మాయగాళ్లున్నారు..పైలం బిడ్డా

'బిడ్డా! మీతో ఆటలాడుతూనో.. చాక్లెట్ ఇస్తూనో మీ ఒంటి మీద చేతులేస్తారు. జరంత హుషారు ఉండాలి. చాతిపై ఎవరు చేయి వేసినా అమ్మకు చెప్పాలి. నడుము కింద, వెనక వైపు, రెండు కాళ్ల మధ్య చేయి వేసినా పెద్ద తప్పు. ఉరుక్కుంటూ పోయి అమ్మకు చెప్పాలి. బిడ్డా మళ్లీ చెబుతున్నా.. ఈ మూడు జాగల్లో చేయి వేసేది మీతో ఆడుకునే దోస్తయినా, పాఠాలు చెప్పే మాస్టారైనా, ఎదురింటి అంకుల్లైనా, ఇంట్లో తాత, మామ, అన్న, తమ్ముడు, ఆఖరికి కన్న తండ్రి అయినా సరే అమ్మకు చెప్పాలి.'

– ఇటీవల వచ్చిన ఓ సినిమాలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ప్రాధాన్యంపై హీరో చెప్పిన మాటలివి.

- 'చిన్నారులను చిదిమేస్తున్నారు'
- పసిమొగ్గలపై పాశవికంగా లైంగిక దాడులు
- మద్యం, గంజాయి మత్తులో పైశాచికత్వం
- ప్రేమ, పెళ్లి అంటూ వంచిస్తున్న ప్రబుద్ధులు
- చిన్నారులపై దాడుల నియంత్రణకు మహిళా భద్రతా విభాగం చర్యలు
- రోజురోజుకూ పెరుగుతున్న పోక్సో కేసులు
- తల్లిదండ్రులూ.. ఆడపిల్లలకు జాగ్రత్తలు చెప్పండి



కరీంనగర్ క్రైం/సిరిసిల్ల క్రైం/జగిత్యాల/గోదావరిఖని(రామగుండం): నేటి సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోంది. వారి అమాయకత్వమే ఆసరాగా కామాంధులు పసిమొగ్గలపై పాశవికంగా లైంగిక దాడులకు పాల్పడుతున్నారు. అభం శుభం తెలియని చిన్నారులను చిదిమేస్తున్నారు. మరోవైపు ప్రేమ, పెళ్లి అంటూ వంచిస్తున్న ప్రబుద్ధులు అమ్మాయిలు తీసుకువచ్చిన ఆభరణాలు, డబ్బు కాజేసి, ఆపై వ్యభిచార ఊబిలోకి నెట్టేస్తున్నారు. ఈ తరహా కేసులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. చిన్నారులపై లైంగిక దాడి, అత్యాచారాలు చేసేవారిపై పోక్సో కేసులు నమోదు చేస్తున్నామని, కోర్టులు సైతం వీటిని తీవ్రంగా పరిగణించి, నేరస్తులకు శిక్ష విధిస్తున్నాయని అంటున్నారు.

గంజాయి, మద్యం మత్తులోనే ఎక్కువ

గంజాయి, మద్యం మత్తులోనే చిన్నారులు, బాలికలపై లైంగిక దాడులు, అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఇలా చేసేవారిలో తెలిసినవారు, బంధువులు, ఇరుగుపొరుగువారు, ఒకే కాలనీకి చెందినవారే ఎక్కువ మంది అని పేర్కొన్నారు. మరికొన్ని కేసుల్లో పాఠాలు బోధించే గురువులు.. ఇంకొన్నింట్లో కుటుంబసభ్యులే ఉంటుండటంతో బాధితులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు.

రెండు పోక్సో కోర్టులు..

కరీంనగర్ జిల్లాలోని న్యాయస్థానాల సముదాయాల్లో పోక్సో కేసులను విచారించడానికి రెండు ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. వీటిల్లో కేసుల విచారణ వేగంగా సాగి, నేరస్తులకు శిక్షలు పడుతున్నాయి.

దర్యాప్తు అధికారులకు ప్రత్యేక శిక్షణ

చిన్నారులపై లైంగిక దాడుల అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తూ రాష్ట్రస్థాయి మహిళా భద్రతా విభాగం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. కరీంనగర్ పోలీసులు పోక్సో కేసుల్లో శిక్షల శాతాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. దర్యాప్తు సరిగా లేకపోతే న్యాయస్థానాల్లో కేసులు వీగిపోతాయని దర్యాప్తు అధికారులకు ప్రత్యేక శిక్షణతోపాటు పలు మెలకువలు నేర్పిస్తున్నారు. కేసు నమోదు చేయడం, సీడీ ఫైల్‌ను రూపొందించడం, సాక్ష్యాధారాలు సేకరించడం, అభియోగ పత్రాలు దాఖలు చేయడం, న్యాయస్థానాల్లో జరిగే ట్రయల్స్‌లో పకడ్బందీగా సాక్ష్యాలు ఇప్పించడం వంటివి చేస్తున్నారు.

ఇవీ కారణాలు..

- చదువుపైనే దృష్టి సారిస్తుండటంతో సమాజంలో జరుగుతున్న అంశాలపై విద్యార్థినులకు అవగాహన కొరవడుతోంది.
- పాఠశాలల్లో గుడ్, బ్యాడ్ టచ్ పాఠ్యాంశాలు చెప్పేవారు లేరు.
- పిల్లల్లో తాను చిన్నపిల్లని కాదని సొంత నిర్ణయాలు తీసుకోగలననే అభిప్రాయం.
- పరిణతిలేని వయసు, తల్లిదండ్రుల పర్యవేక్షణలోపం.
- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిళ్లు.
- హార్మోన్ల ప్రభావం, లైంగిక అంశాలపై ఆసక్తి.
- ప్రలోభాలకు గురికావడం.

అవగాహన కల్పిస్తున్నాం



షీటీం ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు సదస్సులు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలి. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే అమ్మాయిలు వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలి. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలి.

– పి.శ్రీలత, కరీంనగర్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ, షీటీం ఇన్‌చార్జి

సెల్‌ఫోన్లు ఇవ్వొద్దు



ప్రస్తుతం సెల్‌ఫోన్లతోనే అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. పిల్లలను వీటికి దూరంగా ఉంచాలి. ఇంటర్నెట్ అరచేతిలో ఉండటంతో ప్రతీది అందుబాటులో ఉంటోంది. మంచికి వినియోగించుకోవాలి. చెడు వ్యసనాలతో అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ఈ విషయమై చర్యలు తీసుకుంటున్నాం.

– రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల

బ్యాడ్, గుడ్ టచ్ తెలియాలి



ప్రతీ విద్యార్థినికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తెలియాలి. స్కూల్లో రోజంతా ఏం చేశారని అడుగుతూ తల్లిదండ్రులు పిల్లలతో కొంత సమయం గడపాలి. తెలిసీ తెలియని వయసులో బాలికలు లైంగిక వేధింపులకు గురైతే వారి జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుంది.

– దాసరి రఘు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, గోదావరిఖని

సంస్కారం నేర్పాలి



మహిళలు, బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలి. ఆడవాళ్లను గౌరవించే సంస్కారాన్ని అబ్బాయిలకు నేర్పాలి. అప్పుడే అత్యాచారాలు తగ్గే అవకాశం ఉంటుంది. మహిళలకు గౌరవం పెరుగుతుంది.

– లోకిని శారద, గెజిటెడ్ హెచ్‌ఎం, బాలికల హైస్కూల్, సిరిసిల్ల

ఆడపిల్లకు వీటి గురించి చెప్పండి..

శరీర భాగాలు

ప్రతీ తల్లి తన కూతురికి ఆమె శరీర భాగాల గురించి వివరించాలి. ఎవరైనా వారి ప్రైవేట్ భాగాలను తాకడానికి ప్రయత్నిస్తే ఎలా ప్రతిఘటించాలో నేర్పాలి. అలాగే, అలా ప్రవర్తించిన వ్యక్తి గురించి కచ్చితంగా చెప్పాలని చెప్పాలి.

నో చెప్పడం

పిల్లలకు నో చెప్పడం కచ్చితంగా నేర్పాలి. అంటే.. వారు బయటకు వెళ్లినప్పుడు ఎవరైనా ప్రేమగా ఏదైనా ఇచ్చినా, లేదా ఎక్కడికైనా వెళదామని అడిగినా.. నో చెప్పాలని సూచించాలి.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య వ్యత్యాసాన్ని ఆడపిల్లలకు వివరించాలి. ఒక వ్యక్తి పిల్లల తల లేదా నుదుటిని ప్రేమతో తాకినప్పుడు అది మంచి స్పర్శ అవుతుంది. అలా కాకుండా వారి బుగ్గలు లాగడం, తట్టడం, ప్రైవేట్ పార్ట్స్‌ని తాకడం బ్యాడ్ టచ్ కిందికి వస్తాయని చెప్పాలి.

ఎలాంటి వ్యక్తులకు దూరంగా ఉండాలి

మీ కూతురు ఎలాంటి వ్యక్తులకు దూరంగా ఉండాలో చెప్పండి. అంటే.. ఎవరైనా వారిని బలవంతంగా ఒడిలో కూర్చోబెట్టుకున్నా, తాకినా లేదా ముద్దు పెట్టడానికి ప్రయత్నించినా వెంటనే అక్కడి నుంచి పారిపోవాలని పిల్లలకు చెప్పాలి.

3-4 ఏళ్ల పాపకు ఇవి నేర్పండి

3-4 ఏళ్ల వయసులో ఉన్న కూతురికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాను కచ్చితంగా చెప్పాలి. అలాగే, రోజూ వారితో కాసేపు మాట్లాడండి. అయితే, ఆడపిల్లలు ఏదైనా తప్పు జరిగినప్పుడు తల్లిదండ్రులకు అంత తొందరగా చెప్పరు. కాబట్టి వారి ప్రవర్తనపై శ్రద్ధ పెట్టాలి. పాప ప్రవర్తనలో తేడా కనిపిస్తే కచ్చితంగా ఆమె దగ్గర కూర్చొని, ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

ఆ అధికారులను మార్చాల్సిందే!

- అధిష్టానానికి ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

మా జిల్లాలో అధికారులు ముఖ్యంగా పోలీసులు మా మాట వినడం లేదు. ఏం చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇలా అయితే కష్టం. ఆ పోలీసు అధికారులను బదిలీ చేయండి. బీఆర్‌ఎస్ హయాంలో నియామకమైన వారే ఇంకా జిల్లాల్లో అక్కడక్కడా కీలక బాధ్యతల్లో ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా మార్పు కనిపించడం లేదు. అలాంటి అధికారులను మార్చండి.

– కాంగ్రెస్ అధిష్టానానికి ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతల మొర ఇది



ఉమ్మడి జిల్లా నేతలతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్

కరీంనగర్ కార్పొరేషన్: పీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ పరిస్థితిపై గాంధీభవన్‌లో సమీక్షలు చేపట్టారు. శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలతో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీప్‌దాస్‌మున్షితో కలిసి సమావేశమయ్యారు. జిల్లాలో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పథకాలు, విధానాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు, పార్టీ కేడర్‌తో సమన్వయం తదితర అంశాలు చర్చించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు పోలీసు అధికారులపై ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు తమ మాట ఖాతరు చేయడం లేదని, వారిని బదిలీ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో నియమితులైన అధికారులు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ తీరు మార్చుకోవడం లేదని అభిప్రాయపడ్డారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. కరీంనగర్, రామగుండం నగరపాలకసంస్థలతో పాటు అన్ని మున్సిపాల్టీలు, నాలుగు జెడ్పీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలను కైవసం చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పార్టీని సమన్వయ పరుచుకుని స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాలన్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచాం, ఇక మాకు ఏం పనిలేదన్నట్లుగా భావించరాదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రాచుర్యం కల్పించాలని, ప్రతిపక్ష ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, డాక్టర్ సంజయ్, కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలు పాల్గొన్నారు.

2న విద్యుత్ కేంద్రానికి శంకుస్థాపన?

రామగుండం: పట్టణంలోని జీవిత కాలం ముగిసిన 62.5 మెగావాట్ల బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో రాష్ట్రప్రభుత్వం కొత్తగా 800 మెగావాట్ల కొత్త పవర్ ప్లాంట్ స్థాపించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం (ఎనర్జీ విభాగం)- సింగరేణి-జెన్‌కో మధ్య శుక్రవారం ఒప్పందం కుదిరినట్లు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ శనివారం తెలిపారు. నెం.988/power.II/2024, తేదీ:20.09.2024 పేరిట లేఖ విడుదలైందని వివరించారు. అక్టోబర్ 2వ తేదీన ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు కసరత్తు ప్రారంభించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఎల్లంపల్లి ప్రాజెక్టును సైతం అధికారికంగా ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ రెండింటికీ సీఎం రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన చేయించేందుకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అధిష్టానాన్ని కోరినట్లు తెలిపారు.



పండుగకు ముందు రైళ్లు బందు

- నేటినుంచి కాజీపేట-బల్హార్షా సెక్షన్‌లో రైళ్ల రద్దు

రామగుండం: దక్షిణ మధ్య రైల్వేలోని కాజీపేట-బల్హార్షా సెక్షన్‌లో కాజీపేట, వరంగల్, హసన్‌పర్తిరోడ్డు రైల్వేస్టేషన్ల పరిధిలో మూడో రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. దీంతో ఈనెల 22 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్నింటిని దారి మళ్లించారు. తెలంగాణలో అతిపెద్ద దసరా పండుకు ముందు రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను నడిపించాల్సింది పోయి ఉన్నవాటిని రద్దు చేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రద్దయిన రైళ్లు..

- రైలు నంబరు : 17233/34 : సికింద్రాబాద్-సిర్‌పూర్ కాగజ్‌నగర్ (భాగ్యనగర్) : ఈనెల 22 నుంచి అక్టోబర్ 8 వరకు ఇరువైపులా
- రైలు నంబరు : 07765/66 : కరీంనగర్-సిర్‌పూర్(డెమూ) ఈనెల 25 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు ఇరువైపులా
- రైలు నంబరు : 12757/58 : సిర్‌పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (కాగజ్‌నగర్) ఈ నెల 23 నుంచి అక్టోబర్ 7 వరకు ఇరువైపులా
- రైలు నంబరు : 17003/04 : కాజీపేట-బల్లార్షా(రామగిరి) : ఈనెల 26 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు ఇరువైపులా
- రైలు నంబరు : 17033/34 : భద్రాచలంరోడ్-బల్హార్షా(సింగరేణి) : ఈనెల 27 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు
- రైలు నంబరు 17011/12 : హైదరాబాద్-సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (ఇంటర్‌సిటీ) : ఈనెల 28, 29, అక్టోబర్ 2, 3, 6, 7వ తేదీల్లో ఇరువైపులా
- రైలు నంబరు : 12193 : యశ్వంతపూర్-జబల్‌పూర్ : ఈనెల 29, అక్టోబర్ 6న
- రైలు నంబరు : 12194 : జబల్‌పూర్-యశ్వంతపూర్ : ఈనెల 28, అక్టోబర్ 5న
- రైలు నంబరు : 12511 : గోరఖ్‌పూర్-కొచ్చువెల్లి : ఈనెల 22, 26, 27, 29, అక్టోబర్ 3, 4న
- రైలు నంబరు : 12512 : కొచ్చువెల్లి-గోరఖ్‌పూర్ : ఈనెల 24, 25, 29, అక్టోబర్ 1, 2, 6న
- రైలు నంబరు : 12522 : ఎర్నాకులం-భరౌని : ఈనెల 27 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు
- రైలు నంబరు : 12521 : భరౌని-ఎర్నాకులం : 23, 30
- రైలు నంబరు : 16031 : చెన్నై-శ్రీవైష్ణోదేవి కాట్రా : ఈనెల 22, 29, అక్టోబర్ 2
- రైలు నంబరు : 16032 : శ్రీవైష్ణోదేవి కాట్రా-చెన్నై : ఈనెల 27, అక్టోబర్ 4, 5
- రైలు నంబరు : 16317 : కన్యాకుమారి-శ్రీవైష్ణోదేవి కాట్రా : ఈనెల 27న
- రైలు నంబరు : 16318 : శ్రీవైష్ణోదేవి-కన్యాకుమారి : ఈనెల 30న
- రైలు నంబరు : 22151 : పుణె-కాజీపేట : ఈనెల 27 నుంచి అక్టోబర్ 4
- రైలు నంబరు : 22152 : కాజీపేట-పుణె : ఈనెల 29 నుంచి అక్టోబర్ 6
- రైలు నంబరు : 22645 : ఇండోర్-కొచ్చువెల్లి : ఈనెల 23 నుంచి 30 వరకు
- రైలు నంబరు : 22646 : కొచ్చువెల్లి -ఇండోర్ : ఈనెల 21 నుంచి 28 వరకు
- రైలు నంబరు : 22647 : కోర్బా-కొచ్చువెల్లి : ఈనెల 25, 28, అక్టోబర్ 2, 5
- రైలు నంబరు : 22648 : కొచ్చువెల్లి -కోర్బా : ఈనెల 23, 26, 30, అక్టోబర్ 3, 10
- రైలు నంబరు : 05293 : ముజఫర్‌నగర్-సికింద్రాబాద్ : ఈనెల 24, అక్టోబర్ 1
- రైలు నంబరు : 05294 : సికింద్రాబాద్-ముజఫర్‌నగర్ : ఈనెల 26, అక్టోబర్ 3



దారి మళ్లించిన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు

- విశాఖ-న్యూఢిల్లీ(రైలు నంబరు: 20805/06): ఇరువైపులా
- విశాఖపట్టణం-గాంధీధామ్(రైలు నంబరు : 20803/04) : ఇరువైపులా
- పూరి-ఓఖా(రైలు నంబరు : 20819/20): ఇరువైపులా
- గోరఖ్‌పూర్-యశ్వంతపూర్(రైలు నంబరు : 12591) : అక్టోబర్ 5న
- సికింద్రాబాద్-దానాపూర్(రైలు నంబరు : 12791/92) : ఇరువైపులా
- గోరఖ్‌పూర్-సికింద్రాబాద్(రైలు నంబరు : 12589): ఇరువైపులా
- త్రివేండ్రం-న్యూఢిల్లీ(రైలు నంబరు : 12625) : ఇరువైపులా
- గోరఖ్‌పూర్-కొచ్చువెల్లి(రైలు నంబరు : 12511) : ఇరువైపులా
- హైదరాబాద్-న్యూఢిల్లీ(రైలు నంబరు : 12723/24) : ఇరువైపులా
- దర్భంగా-సికింద్రాబాద్ (రైలు నంబరు : 17008) : అక్టోబర్ 1న.

జాతీయస్థాయిలో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న ఈడీ కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్(రామగుండం): రోలర్ స్కేటింగ్‌లో జాతీయస్థాయిలో రాణించాలని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. శనివారం ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని స్కేటింగ్ గ్రౌండ్‌లో జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. రోలర్ స్కేటింగ్‌లో ఆసక్తి కనబరుస్తున్న బాల, బాలికలకు ఎన్టీపీసీ అండగా ఉంటుందని, జాతీయస్థాయిలో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అసోసియేషన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఐలి విజయభాస్కర్, కార్యదర్శి కృష్ణమూర్తి, జనరల్ మేనేజర్లు అలోక్ కుమార్ త్రిపాఠి, సంజీవ్‌కుమార్, సంతోష్ తివారి విజేతలకు బహుమతులు అందజేశారు.

'ఇనుముల'పై మరో కేసు

- సతీశ్‌ను త్వరలోనే అరెస్టు చేస్తాం: సీఐ రాజు

మంథని: అక్రమ వసూళ్ల వ్యవహారంలో ఇనుముల సతీశ్‌పై నాలుగో కేసు నమోదైంది. మంథని పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే రెండు నమోదు కాగా, శనివారం మరో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. శనివారం మంథనిలో నమోదైన కేసు వివరాలను సీఐ రాజు వెల్లడించారు. నాగారం(ప్రస్తుతం మంథనిలో నివాసం) గ్రామానికి చెందిన బెల్లంకొండ రవీందర్‌రెడ్డి కాంట్రాక్టు వర్క్ చేస్తున్నాడు. గత మేలో ఐదు కాంట్రాక్ట్ పనులు వచ్చాయి. అందులో మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారు. గత జూలై 7న మాజీ ఉప సర్పంచ్ ఇనుముల సత్యనారాయణ ఉరఫ్ సతీశ్ జోక్యం చేసుకుని 'నీకు బాగా కాంట్రాక్టులు వచ్చాయి కదా.. నాకు రూ.రెండు లక్షలు ఇవ్వాలి. లేకపోతే నీ కాంట్రాక్ట్ బిల్లులు రాకుండా చేస్తా' అని బెదిరించాడు. భయపడి గత ఆగస్టు 28న అతడి స్నేహితుడితో కలిసి బీఎస్ ఫంక్షన్‌హాల్ వద్ద మెయిన్ రూ.లక్ష సతీశ్‌కు ఇచ్చారు. మిగతా రూ.లక్ష ఇవ్వకపోతే ఆస్తి, ప్రాణనష్టం కలిస్తానని పలుమార్లు సతీశ్ బెదిరించాడు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. బాధితులు ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. మూడు కేసుల్లో ఇనుముల సతీశ్‌కు సహకరించిన రావికంటి సతీశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇనుముల సతీశ్‌ను కూడా త్వరలో అరెస్టు చేస్తామని ఆయన చెప్పారు.

రుణమాఫీ కోసం రైతుల ధర్నా

పాలకుర్తి(రామగుండం): పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని, రైతుభరోసా సొమ్ము విడుదల చేయాలనే డిమాండ్‌తో రైతులు పాలకుర్తి మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు, కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశికహరి రైతుల ధర్నాకు నేతృత్వం వహించారు. రైతులు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఆందోళనకారులను అరెస్ట్ చేసి బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రుణమాఫీ, రైతుభరోసా పథకాలు పూర్తిస్థాయిలో వర్తింపజేయాలనే డిమాండ్‌తో ధర్నా చేసేందుకు సిద్ధం కావాలని బీఆర్‌ఎస్ నేత కౌశికహరి నాలుగు రోజుల క్రితమే రైతులు, పార్టీ శ్రేణులకు సమాచారం అందించారు. అయితే, ధర్నాను అడ్డుకునేందుకు పోలీసులు శనివారం తెల్లవారుజామునే కౌశికహరిని హౌస్ అరెస్టు చేసేందుకు పూనుకోగా.. అప్పటికే ఆయన అక్కడి నుంచి ఎంటో వెళ్లిపోయారు. దీంతో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిమెంట్ కర్మాగారం, తహసీల్దార్ కార్యాలయం వద్ద పహారా కాచారు. కొందరు బీఆర్‌ఎస్ నాయకులు, కౌశికహరి అనుచరులను ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. స్థానిక పరిస్థితులను సమీక్షించిన కౌశికహరి ధర్నా వేదికను పాలకుర్తి తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయానికి మార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు కంగుతిని వెంటనే ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు భారీగా బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కౌశికహరికి మద్దతుగా నిలిచారు. రెండుగంటల తర్వాత సొంత పూచీకత్తుపై ఆందోళనకారులను విడుదల చేశారు. దాదాపు 5గంటల పాటు కొనసాగిన ఈ హైడ్రామాతో ఆద్యంతం ఉత్కంఠ చోటుచేసుకున్నది. మేరుగు పోచం, ముల్కల కొమురయ్య, ముత్యం లక్ష్మణ్, వేల్పుల సంపత్, కండె స్వామి, సతీశ్, శ్రీధర్, పెద్దపల్లి నాగరాజు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

భూ వివాదాలతోనే హత్య

- పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ వెల్లడి
- కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

పెద్దపల్లిరూరల్: ఏళ్లకేళ్లుగా సాగుతున్న భూ వివాదాలతో కక్ష పెంచుకున్న దాయాదులు వరుసకు సోదరుడయ్యే కలవేన రాజేశంను కర్రలతో చితకబాది హత్య చేశారని ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావుతో కలిసి కొత్తపల్లిలో గురువారం జరిగిన రాజేశం హత్య కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. కలవేన రాజేశం రైల్వేలో కార్మికుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశాడు. కొత్తపల్లిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. రాజేశం పినతండ్రి కొడుకు కలవేన లక్ష్మయ్య సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశాడు. ఇతడి సోదరులు కలవేన రాజయ్య, కలవేన మల్లయ్యతో భూముల విషయమై గొడవలు జరుగుతున్నాయి. న్యాయస్థానాల్లోనూ కేసులు నడుస్తున్నాయి. 15ఏళ్లుగా తమను మానసికంగా ఇబ్బందులు పెడుతూ భూముల విషయంలో సమస్యలు సృష్టిస్తున్నాడని రాజేశంపై కక్ష పెంచుకుని అతడి హత్య చేసి అడ్డుతొలగించాలనే నిర్ణయానికి వచ్చారు. గురువారం రాజేశం తన పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేక్రమంలో లక్ష్మయ్య, అతడి సోదరులు రాజయ్య, మల్లయ్య వాగ్వాదానికి దిగారు. అంతలో లక్ష్మయ్య కర్రతో రాజేశం తలపై కొట్టడంతో కిందపడ్డాడు. అతడి సోదరుడు మల్లయ్య కూడా కర్రతో చితకబాదడంతో కలవేని రాజేశం మరణించాడు. రాజేశం మరణించాడని నిర్ధారించుకుని ఘటనాస్థలం నుంచి ముగ్గురు పారిపోయారు. కలవేన లక్ష్మయ్య కొత్తపల్లిలోని ఇంటివద్దకు వచ్చాడని సమాచారం అందుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో వెళ్లి బైక్‌ను, హత్యకు ఉపయోగించిన కర్రను స్వాధీనం చేసుకున్నారు. మరోఇద్దరు కలవేన రాజయ్య, మల్లయ్య పరారీలో ఉన్నారు. వారిని కూడా పట్టుకుంటామని ఏసీపీ తెలిపారు.